క్లుప్తంగా

వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం పంపిణీ



నగరంపాలెం: నిరాదరణకు గురైన అభాగ్యుల్ని ఆదుకునేందుకు దాతలు, సేవా సంస్థలు ముందుకు రావాలని శ్రీ హనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ కోరారు. కొత్తపేట జానీ కాంప్లెక్స్ ఆవరణలోని సమితి కార్యాలయంలో ఆదివారం యాభై మంది వృద్ధులు, దివ్యాంగులకు ఉచితంగా బియ్యం, పది రకాల నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉచిత బియ్యం కమిటీ చైర్మన్ పోలేపల్లి వెంకట సుబ్రహ్మణ్యం, కార్యదర్శి మాదాల ప్రకాష్, సభ్యులు ఎస్.వి.రమణ, పలకలూరి శివరావు, టి.మురళీసాయి, ఎ.వాసుదేవరావు, పోలేపల్లి హరి పాల్గొన్నారు.

అలరించిన అన్నమాచార్య సంకీర్తన విభావరి



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై శ్రీ సాయి సంగీత కళా నిలయం శిష్య బృందం అన్నమాచార్య సంకీర్తనల్ని శ్రావ్యంగా ఆలపించింది. ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నమో గణపతే, వచ్చెను అలమేలు మంగ, శ్రీ వేంకట రమణుడు మా స్వామి, కొండలలో కొలువైన శ్రీనివాసుడా అంటూ పలు సంకీర్తనల్ని గాయకులు ఆలపించారు. వీరికి హరిబాబు, వెంకట వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమాన్ని తిన్నలూరి హరిబాబు నిర్వహించారు.

శాంకరీమాతకు ఆషాఢం సారె



గుంటూరు రూరల్: మండలంలోని లాలుపురం గ్రామం శాంకరీమాత నామంతో పులకరించిపోయింది. ఆదివారం శాంకరీ మాతకు జై అంటూ మహిళలు గ్రామ పురవీధుల్లో ఊరేగింపు ఘనంగా జరిపారు. అమ్మవారికి పాటిమీద మహిళా భక్తులు సామూహికంగా ఆషాఢ మాసం సారెను సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ వస్త్రాలు ధరించి రకరకాల పూలు, గాజులు, స్వీట్లు, చలిమిడి, పసుపు కుంకుమలను చేత పట్టుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. మేళతాళాలు, టపాసులు ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకారాన్ని నిర్వహించారు. అమ్మవారికి కలువ పూలతో అలంకరించిన దండ ప్రత్యేక ఆకర్షణగా ఉంది. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

పెదనందిపాడు: పేకాట శిబిరం పై దాడి చేసి ముగ్గురుని అదుపులోకి తీసుకున్నట్లు పెదనందిపాడు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వరగాని గ్రామంలో పేకాట ఆడుతున్న సమాచారం తెలుసుకుని సిబ్బందితో దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.5,200నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఇరువురికి గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ పరిధిలో ఆదివారం జరిగింది. మండల పరిధిలోని శలపాడు గ్రామానికి చెందిన సుద్దపల్లి రాజేంద్ర నారాకోడూరు నుంచి చేబ్రోలు వైపునకు బైక్ వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ప్రమాదవశాత్తూ ఢీకొట్టాడు. ఈ సంఘటనలో రాజేంద్రతో పాటు పెదగాదెల వర్రు ప్రాంతానికి చెందిన పి.రవికిషోర్‌కు గాయాలయ్యాయి. ఇద్దరిని 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చేబ్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీ భీమేష్

మంగళగిరి: బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నగరానికి చెందిన పంచుమర్తి లక్ష్మీ భీమేష్ నియమితులయ్యారు. ఈమేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నర్సరావుపేటలో జరిగిన కార్యక్రమంలో ఉత్తర్వుల కాపీని అందజేసినట్లు లక్ష్మీ భీమేష్ ఆదివారం తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలను అప్పగించిన కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

రోగులకు సత్వర వైద్య సేవలు అందించేందుకు కృషి

- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్
- క్యాజువాల్టీలో ఆకస్మిక తనిఖీలు
- ఐసీయూలో అయిదు పడకల ఏర్పాటు



క్యాజువాలిటీలో వైద్యులకు ఆదేశాలు జారీ చేస్తున్న డాక్టర్ కిరణ్ కుమార్

గుంటూరు మెడికల్: జీజీహెచ్ క్యాజువాల్టీలో రోగులకు సత్వర వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. ఆయన ఆదివారం ఆసుపత్రిలోని క్యాజువాల్టీ, ఇతర వైద్య విభాగాల్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాజువాల్టీ ఎదురుగా అంబులెన్స్‌లు, కార్లు, ద్విచక్ర వాహనాలు అడ్డదిడ్డంగా నిలిపి ఉండటం గమనించారు. వాహనాల నియంత్రణకు సరిగా చర్యలు తీసుకోవడం లేదంటూ సెక్యూరిటీ సిబ్బందిపై మండిపడ్డారు. వాహనాలకు సరైన పార్కింగ్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. క్యాజువాల్టీ ఓపీ రిజిస్ట్రేషన్‌లో ఒక డేటా ఎంట్రీ ఆపరేషటర్ ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. రోజుకు వందల సంఖ్యలో రోగులు వస్తుంటే కేవలం ఒక ఆపరేటర్ ఉంటే ఎలా అని కాంట్రాక్టర్ బాలకృష్ణను ఫోన్‌లో ప్రశ్నించారు. ఈ- రిజిస్ట్రేషన్ కౌంటర్‌లో ప్రింటర్లను ఏర్పాటు చేసి ఇద్దరు ఆపరేటర్లను నియమించాలని ఆదేశించారు. రోగి సమాచారం తీసునేటప్పుడు ఆధార్‌తో పాటు ఫోన్ నంబర్ కూడా తీసుకోవాలని సూచించారు.

ఈసీజీ గదిలో టెక్నీషియన్‌కు బదులుగా స్టూడెంట్ ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు మిషన్లలో ఒకటి పని చేయడం లేదని సిబ్బంది చెప్పడంతో వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. మహిళలు, పురుషులకు ఈసీజీ పరీక్షలు వేర్వేరుగా తీయాలని చెప్పారు. మహిళలకు పరీక్షలు చేసే సమయంలో నర్సుతో పాటు మహిళా సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని తెలిపారు. క్యాజువాల్టీ ఐసీయూ అస్తవ్యస్తంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన మంచాలు లేకపోవడంతో వెంటనే వర్క్ షాపు నుంచి అయిదు పడకలను ఏర్పాటు చేయించారు. ఐసీయూలో ప్రతి బెడ్‌కు మానిటర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. డ్యూటీ అసిస్టెంట్ ఫిజీషియన్ (డీఏపీ), డ్యూటీ అసిస్టెంట్ సర్జన్ (డీఏఎస్)లను కూడా ట్రీయేజ్ ఐసీయూలో ఉండాలని ఆదేశించారు. అత్యవసరంగా రోగులకు సీపీఆర్ చెయ్యడానికి ఎమర్జెన్సీ డాక్టర్లు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తి చేసి, సంబంధిత వైద్యులు విధుల్లోకి రావాలని ఆదేశించారు. మైనర్ ఆపరేషన్ థియేటర్‌లో సదుపాయాలు లేకపోవడంపై మండిపడ్డారు. వెంటనే అవసరమైన విద్యుత్ లైట్లు ఇతర సౌకర్యాల్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. కాన్పుల వార్డులో రోగులకు ఏర్పాటు చేసిన బాత్ రూమ్‌లు అస్తవ్యస్తంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగుల సహాయకుల్ని నియంత్రించేందుకు సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని ఆదేశించారు.

గర్భిణులకు ప్రత్యేక రక్షణ

కాన్పుల వార్డులో కడుపులో బిడ్డ చనిపోయిన తల్లిని పరామర్శించారు. ఆమె అందిస్తున్న వైద్యం గురించి వైద్యుల్ని అడిగి తెలుసుకున్నారు. అల్ట్రాసౌండ్ గదిని పరిశీలించి, అక్కడ అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను అందుబాటులో ఉండాలన్నారు. సెల్‌ఫోన్లు, సామానుల భద్రత, రోగుల సహాయకుల నియంత్రణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. క్యాజువాల్టీ ఎదురుగా టీ షాపు నిర్వహించేందుకు అనుమతులు ఇస్తే వాటి స్థానంలో వివిధ రకాల వస్తువులు విక్రస్తున్నారని పోలీసులు సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. అనుమతులిచ్చిన కాపీని అందరికీ తెలిసేలా షాపు నిర్వాహకులకు ఆదేశించారు. అప్పటి వరకు వ్యాపారాలు నిలిపి వేయాలని చెప్పారు. ఆయన వెంట అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శ్రావణ్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ షేక్ సమీనా బేగం, బయో మెడికల్ ఇంజనీర్ చంద్రశేఖర్, శానిటేషన్, భద్రత సిబ్బంది ఉన్నారు.

సామాజిక సేవ ఆర్యవైశ్యులకు వరం

పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్



వృద్ధుడికి పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, మద్దు రామకృష్ణయ్య

గుంటూరు ఎడ్యుకేషన్: ఆకలితో ఉన్న వారి కడుపు నింపి, విద్యార్థులకు ఉపకార వేతనాలు, వృద్ధులకు వైద్య సేవలు, పింఛన్లు ద్వారా ఆదుకోవడం కుల దైవమైన వాసవీ మాత ఆర్యవైశ్యులకు ఇచ్చిన గొప్ప వరమని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. మద్దు రామకృష్ణయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరి రోడ్డులోని ఏఎస్ కన్వెన్షన్‌లో వృద్ధులకు పింఛన్లు, మందుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వరుసగా నాలుగో ఏడాది 200 మంది వృద్ధులకు ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ఇచ్చే పింఛన్‌ను నాలుగు నెలకు కలిపి రూ.1,600 చొప్పున రూ.3.20 లక్షలతోపాటు ఉచిత వైద్య పరీక్షలు, మందులు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గిరిధర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతినెలా ఒకటో తేదీన రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మందికి రూ.2,750 చొప్పున వృద్ధాప్య పెన్షన్లు అందజేయడం దేశ చరిత్రలో సువర్ణాధ్యాయం అని పేర్కొన్నారు. తన పుట్టినరోజు నాడు వృద్ధుల కళ్లలో ఆనందం చూడాలని మద్దు రామకృష్ణయ్య చారిటబుల్ ట్రస్టు ద్వారా లక్షలాది రూపాయలు అందించడంతోపాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి వారికి కడుపునిండా భోజనం పెట్టడం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ట్రస్టు వ్యవస్థాపకుడు మద్దు రామకృష్ణయ్య మాట్లాడుతూ సమాజ సేవ చేసేందుకు కుటుంబం తనకు సహకారాన్ని అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మద్దు సత్యవతి, జయలక్ష్మి, శ్రీమన్నారాయణ, భావన్నారాయణ, మున్నలూరి గౌరీశంకర్, కొత్తమాసు ఏకనాథ్, శ్రీనివాస్, డాక్టర్ వందనపు నవీన్, డాక్టర్ ఉప్పుటూరి అంజిత్, డాక్టర్ ఎం.వినోద్, డాక్టర్ కె.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

యూసీసీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ



వెస్ట్ ప్యారిస్ చర్చి వద్ద సంతకాల సేకరణ

నెహ్రూనగర్: ఆల్ ఇండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్(ఐక్య) ఆధ్వర్యంలో యూనిఫైడ్ సివిల్ కోడ్(యూసీసీ)కి వ్యతిరేకంగా ఆదివారం నగరంలోని పలు చర్చిల వద్ద సంతకాల్ని సేకరించారు. ఈ సందర్భంగా ఐక్య వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు మాట్లాడతూ భారత పౌరుల్ని ప్రమాదంలో పడేసే యూసీసీ అమలుకు తాము వ్యతిరేకమన్నారు. యూసీసీ ఏర్పాటు చేయడమంటే అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని కించపరచడమేనని తెలిపారు. రాజ్యాంగంలోని సెక్యులర్ వ్యవస్థ, సమానత్వానికి సంబంధించిన పలు అధికరణాల్ని తీసివేసే అవకాశముందని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని మార్చి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోమని ఆయన హెచ్చరించారు. సంతకాల సేకరణ సోమవారం సాయంత్రం వరకు ఉంటుందని, వాటిని ఢిల్లీలోని భారత లా కమిషన్‌కు సమర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గాబ్రియేల్, మద్దు ప్రేమజ్యోతిబాబు, కందుల దీనమణిరాజు పాల్గొన్నారు.

సీఏ ఫైనల్ ఫలితాల్లో దేశవ్యాప్తంగా వేలాది మంది ఉత్తీర్ణత

మాస్టర్ మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్



మోహన్

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఈనెల 5న ప్రకటించిన సీఏ ఫైనల్ ఫలితాల్లో దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు సీఏ పూర్తి చేశారని గుంటూరులోని మాస్టర్‌మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ ఆదివారం తెలియజేశారు. ఈ విధంగా సీఏ ఫైనల్ పూర్తి చేసి చార్టర్డ్ అకౌంటెన్సీ పట్టా పొందుతున్న విద్యార్థులు 13,430 మంది ఉన్నట్లు చెప్పారు. సీఏ ఫైనల్‌లో గ్రూప్-1, గ్రూప్-2లో ఉత్తీర్ణులైన విద్యార్థులు వేలాది మందిగా ఉన్నారని వివరించారు. ఇటీవల వచ్చిన ఫైనల్ ఫలితాల్లో ఇవి అత్యున్నతమని పేర్కొన్నారు. మాస్టర్ మైండ్స్‌తో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాల వారీగా అన్ని విద్యాసంస్థల నుంచి పరీక్షలు రాసి ఉత్తీర్ణులైన విద్యార్థులు పెద్దసంఖ్యలో ఉండటం విశేషమన్నారు. సీఏ ఫైనల్ పరీక్షలు ఏడాదికి రెండుసార్లు జరుగుతాయని, వచ్చే ఏడాది జనవరిలో జరగనున్న ఫైనల్ ఫలితాల్లో మరొక 14వేల మంది వరకు ఉత్తీర్ణులయ్యే అవకాశముందని తెలిపారు. ఒక ఏడాదిలో దాదాపుగా 28వేల నుంచి 30వేల వరకు సీఏ ఫైనల్‌లో ఉత్తీర్ణత సాధిస్తారని, ఇది గొప్ప రిజల్ట్ అని తెలిపారు. సీఏ కోర్సులు ఎంతో కష్టమైనవని చాలా మందిలో ఉన్న అనుమానాన్ని నివృత్తి చేయడం కోసంఫైనల్ ఫలితాలే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు



విద్యార్థులకు పుస్తకాలు, ప్రోత్సాహకాలను అందజేస్తున్న రజక సంఘ నాయకులు

నెహ్రూనగర్: విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని రజక చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మానేపల్లి దుర్గారావు పేర్కొన్నారు. బీఆర్ స్టేడియం ఎదురుగా ఉన్న గంగానమ్మ గుడి ఆవరణలో ఆదివారం పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన రజక విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు బ్యాగులు, బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలంటే చదువు ఒక్కటే మార్గమని చెప్పారు. దాన్ని ప్రధాన ఆయుధంగా మలుచుకుని అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వెలివేటి నాగేశ్వరరావు, మురళి, సాంబశివరావు, రాంబాబు, భగత్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు నగరపాలక సంస్థలో స్పందన

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని ఆమె పేర్కొన్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు సచివాలయాల్లోనూ స్పందన ఉంటుందని, స్థానికంగా పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తమకు ఫిర్యాదు చేయవచ్చని ఆమె సూచించారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

గుంటూరు ఈస్ట్: పేకాట ఆడుతున్న ఆరుగురిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. అమరావతి రోడ్డులోని ఆదిత్య లాడ్జి పెంట్ హౌస్‌లో కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ. 27,130 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలకు వ్యాపార అవకాశాలపై అవగాహన



అవగాహన సదస్సులో పాల్గొన్న సుజాతారెడ్డి, యామిని శర్మ, ఎస్‌బీఐ ఏజీఎం తదితరులు

గుంటూరు మెడికల్: స్వావలంబి భారత్ అభియాన్ ఆధ్వర్యంలో ఆదివారం అరండల్‌పేటలోని వావిలాల సంస్థ కార్యాలయంలో మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు చెందిన 62 మంది మహిళలు పాల్గొన్నారు. ఫ్యాషన్ వింగ్స్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ యజమాని పి.సుజాతారెడ్డి వ్యాపార అవకాశాలు, ఎంబ్రాయిడింగ్ మెలకువలపై అవగాహన కల్పించారు. బ్యాంకింగ్ సేవలు, ముద్ర రుణాల్ని పొందే విధానం గురించి ఎస్‌బీఐ ఏజీఎం వి.శ్రీనివాసరావు వివరించారు. హరి గార్మెంట్స్ యజమాని డి.హరి వ్యాపారం, మార్కెట్లో మెలకువలను తెలియజేశారు. స్వావలంబి భారత్ అభియాన్ సంస్థ లక్ష్యాలు, చేసిన పనులు, భవిష్యత్ కార్యాచరణ గురించి కాకాని పర్థీరాజ్ వివరించారు. కుటుంబాన్ని, వ్యాపారాన్ని సమన్వయం చేసుకునే విధానాన్ని యామిని శర్మ తెలిపారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా కన్వీనర్ ఈ.కోటేశ్వరరావు, మల్లాది రవి, గుంటూరు జిల్లా విభాగ ప్రముఖ్ పి.రవిశంకర్, మల్లికార్జునరావు, రాజేశ్వరి, శైలజ, వెంకటేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాలలకు నైతిక విలువలపై అవగాహన కల్పించండి

పాత గుంటూరు: బాలలకు నైతిక విలువలపై అవగాహన కల్పించేందుకు గురువులు కృషి చేయాలని సత్యసాయి సేవాసంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు చెప్పారు. నగరంపాలెం జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని శ్రీ సత్య సాయి బాలవికాస్‌లో ఆదివారం గురువులకు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యతోపాటు, విద్యార్థులకు నైతిక విలువల ప్రాముఖ్యత గురించి వివరించాలని తెలిపారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 250 మంది గురువులు కార్యక్రమంలో పాల్గొన్నారు. సంస్థ జిల్లా అధ్యక్షుడు కె.నారాయణరావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. రీసోర్స్‌పర్సన్లు శిక్షణ ఇచ్చారు. పలువురికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్రబాల వికాస్ విభాగ సమన్వయకర్తలు వి.శకుంతల, టి.మధుసూదనరావు, జిల్లా సమన్వయకర్తలు ఆర్.మాధవి, పి.అప్పారావు, ఆదూరి హైమావతి, సీనియర్ ఫ్యాకల్టీలు, సభ్యులు పాల్గొన్నారు.

కార్మెల్‌మాత జెండా ప్రతిష్ట మహోత్సవం



జెండాల వద్ద ప్రార్థనలు చేస్తున్న విచారణ గురువులు

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని బాల ఏసుదేవాలయంలో కార్మెల్‌మాత పండుగను పురస్కరించుకొని ముందుగా కొండపై జెండా ప్రతిష్ట మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే బాల ఏసుదేవాలయం వద్ద విచారణ గురువులు పామిశెట్టి బాలస్వామి, సహాయ విచారణ గురువులు రాజారపు అనిల్‌కుమార్, వైకుంఠపురం విచారణ గురువు తుమ్మా కరుణాకర్, ఆత్మకూరు విచారణ గురువు ఉన్నం కిరణ్ దివ్యపూజాబలి నిర్వహించారు. ఈసందర్భంగా పి.బాలస్వామి వాక్యోపదేశం చేస్తూ మహిమగల వరాలనిచ్చే తల్లి కార్మెల్‌మాత అని చెప్పారు. ఈనెల 14,15,16 తేదీల్లో కార్మెల్‌మాత ఆలయ శత వార్షికోత్సవ ముగింపు వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా పండుగను క్రైస్తవులకు తెలియజేస్తూ అందుకు సూచనగా జెండాలను కొండపైనున్న ఆలయం వద్ద ఎగురవేయనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రత్యేక దివ్యపూజాబలి నిర్వహించి పోస్టర్లను ఆవిష్కరించారు.

కల్యాణ మండప నిర్మాణానికి నిధులు మంజూరు



ఎంపీ బాలశౌరికి వినతి పత్రం అందజేస్తున్న చక్రాయపాలెం గ్రామస్తులు

పట్నంబజారు: కొల్లిపర మండలంలోని చక్రాయపాలెంలో కల్యాణ మండప నిర్మాణానికి మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి నిధులు మంజూరు చేశారు. కల్యాణ మండపం నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని గ్రామస్తులు గుంటూరు కృష్ణనగర్‌లోని ఎంపీ నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలసి వినతిపత్రం అందజేశారు. కల్యాణ మండపం నిధుల కొరత కారణంగా నిలిచిపోయిందని ఎంపీ దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రూ. 31 లక్షలు ఎంపీ నిధులు మంజూరు చేయించారు. గ్రానైట్ వేయడానికి రూ. 9లక్షలు కలిపి మొత్తం రూ. 40 లక్షలు అందజేశారు. ఎంపీని కలిసిన వారిలో చక్రాయపాలెం గ్రామ మాజీ సర్పంచ్ చందు నాగేశ్వరరావు, గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు బూరెల నాంచారమ్మ, బూరెల దుర్గాప్రసాద్, అత్తోట మండల నాయకులు కఠారి ప్రసాద్, పసుపులేటి రమేష్, చందు కోటయ్య, చందు హరిబాబు, ఆలా శ్రీనివాసరావు, పోకల సాంబశివరావు, రెడ్రౌతు వెంకట సాంబయ్య, పసుపులేటి శివన్నారాయణ, పరుచూరి శివ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆళ్ల నాగేశ్వరరావు కవితకు వైఎస్సార్ స్మారక పురస్కారం



తెనాలి: వైఎస్సార్ జీవితం - వ్యక్తిత్వం'పై ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో జరిగిన వచన కవితల పోటీల్లో పట్టణానికి చెందిన కవి, ఆర్టీసీ కండక్టర్ ఆళ్ల నాగేశ్వరరావుకు వైఎస్సార్ స్మారక పురస్కారాన్ని అందుకున్నారు. స్వర్గీయ డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌కు చెందిన తెలుగు దినపత్రిక 'పున్నమి' నిర్వహించిన ఈ పోటీలకు 'చిరస్మరణీయుడు వైఎస్సార్' అనే కవితను పంపారు నాగేశ్వరరావు. ఉత్తమ తెలుగు వచన కవితను రాసి వైఎస్సార్‌పై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారంటూ పున్నమి సంపాదకుడు తనకు పురస్కార పత్రాన్ని పంపినట్టు ఆళ్ల ఆదివారం తెలియజేశారు. గుంటూరు-2 డిపోలో ఆర్టీసీ కండక్టరుగా చేస్తున్న నాగేశ్వరరావు, ప్రవృత్తిగా సాహితీ రచనలు చేస్తున్నారు. వివిధ అవార్డులను అందుకున్నారు.

జీవితంలో ఎదగటానికి చదువే ఉత్తమ సాధనం

ఐఆర్ఎస్ అధికారిణి వి.కోటేశ్వరమ్మ



ఉత్తమ విద్యార్థిని సత్కరిస్తున్న కోటేశ్వరమ్మ, నల్లమోలు సుబ్రహ్మణ్యం

తెనాలి: జీవితంలో రాణించాలంటే చదువే ఉత్తమ సాధనమని ఐఆర్ఎస్ అధికారిణి వి.కోటేశ్వరమ్మ స్పష్టం చేశారు. అకడమిక్ విద్యతోపాటు విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను చదవాలని సూచించారు. పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ముత్యంశెట్టి పాలెంలోని పద్మశాలీయ కల్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సభలో ఉత్తమ విద్యార్థులకు బంగారు పతకాలు, ఉపకార వేతనాలు, 209 మందికి నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. క్విజ్ పోటీల్లో మొదటి మూడు స్థానాలను సాధించిన గ్రూపులకు సర్టిఫికెట్లు, మెడల్స్‌ను బహూకరించారు. సొసైటీ అధ్యక్షుడు జొన్నాదుల నరసింహారావు అధ్యక్షత వహించారు. మరో ముఖ్య అతిథి భారత ప్రభుత్వ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ ఛేంజ్ మంత్రిత్వశాఖ జాయింట్ డైరెక్టర్ (సైంటిస్ట్-డి) నలుమోలు సుబ్రహ్మణ్యం (న్యూఢిల్లీ) మాట్లాడుతూ నిరుపేద కుటుంబ నుంచి వచ్చిన తాను, ఈ స్థాయికి రావటంలో పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ కృషి ఉందన్నారు. పదో తరగతిలో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన కాటాబత్తుల నవ్యశ్రీ, చింపిరి, జక్కా యశ్వంత్ కుమార్‌ను బంగారు పతకాలతో సత్కరించారు. పట్టణంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ ఫస్ట్ సాధించిన విద్యార్థులకు రూ.3 వేల నగదుతో మెడల్స్‌ను ఇచ్చి సన్మానించారు. గంజి ప్రభాకరరావు స్వాగతం పలికిన సభలో డాక్టర్ కటకం పురుషోత్తమరావు, కన్నా మాష్టారు, హరిప్రసాద్, అప్పారావు, రామకృష్ణ, దివి పురుషోత్తం, కటకం శేషగిరిరావు, భాస్కరరావు, ఓంకార్ ప్రసాద్, అక్కల శ్రీరామ్, జొన్నాదుల మహేష్, విద్యాసాగర్, శివశంకర్, పూర్ణచంద్రరావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధే వైఎస్సార్ సీపీ ధ్యేయం


- శివాలయంలో ధర్మకర్తల మండలి అభినందన సభ
- ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య



పెదకాకాని శివాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య, వేదికపై ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి

పెదకాకాని: దేవాలయాల అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని స్థానిక శాసనసభ్యుడు కిలారి వెంకటరోశయ్య అన్నారు. గుంటూరు జిల్లా పెదకాకాని గ్రామంలో వేంచేసియున్న మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం నూతన పాలకమండలి సభ్యుల అభినందన సభ నిర్వహించారు. సభకు ముఖ్య అతిథులుగా స్థానిక శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య, శాసనమండలి సభ్యుడు, ప్రభుత్వ చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, తాడిశెట్టి మురళీమోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య మాట్లాడుతూ దేవాలయ పవిత్రను కాపాడుతూ అభివృద్ధికి ధర్మకర్తల మండలి సభ్యులు కృషి చేయాలన్నారు. ధర్మకర్తల మండలి నియామకంలో అన్ని వర్గాలకు సమన్యాయం పాటించినట్లు చెప్పారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నామినేటెడ్ పదవుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించినట్లు పేర్కొన్నారు. పాలకవర్గంలోనూ మహిళలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తూ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని కమిటీ సభ్యులకు ఆయన సూచించారు. అభినందనసభ పురస్కరించుకుని వెంకటకృష్ణాపురం గ్రామం నుంచి పెదకాకాని శివాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ముందుగా దేవస్థానానికి విచ్చేసిన ప్రముఖులు భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, ఆలయ సహాయ కమిషనర్ ఎన్.శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు గజ్జల సుబ్బాయమ్మ, కొమ్మారి శివరత్నాలు, తోట రవీంద్ర, కారంకి నాగేశ్వరమ్మ, గంగవరపు మల్లేశ్వరరావు, గుమ్మల వెంకటరావు, చీడిపూడి అరుణ, పాలడుగు వేంకటేశ్వరరావు, మందాళ జ్యోతి, కాట్రోతు పార్వతి, ఎక్స్‌అఫీషియో సభ్యులు, పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాద్, సర్పంచ్ గోళ్ళ స్వరూపరాణి, జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, ఎంపీపీ తుల్లిమల్లి శ్రీనివాసరావు, దుర్గామల్లేశ్వరస్వామి వారి దేవస్థాన చైర్మన్ రాంబాబు, స్థానిక నాయకులు మాదా రాధా, మండల కన్వీనర్ చాగంటి మురళీమోహన్‌రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

అష్టభుజ దుర్గమ్మకు 'ఆషాఢం' సారె



తెనాలి: పట్టణంలోని గంగానమ్మపేటలో చారిత్రక ప్రసిద్ధి చెందిన శ్రీరామేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అష్టభుజ దుర్గమ్మకు 'మన ఊరి సారె'ను సమర్పించారు. ఆషాఢ మాసం సందర్భంగా పుట్టి నింటి నుంచి సారె పంపటం సంప్రదాయం. ఆధ్యాత్మిక వేదిక శివశక్తి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో 400 మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. బోసు రోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలోని శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి సన్నిధి నుంచి మహిళలు, కలశాలు, సారె పళ్లాలతో ఊరేగింపుగా గంగానమ్మ పేటలోని శ్రీరామేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన శివశక్తి సంస్థ వ్యవస్థాపకుడు సుగ్గన కరుణాకర్ నేతృత్వంలో అష్టభుజ దుర్గమ్మకు సారెను సమర్పించారు.